క్లుప్తంగా

వైవీయూ ఉప కులపతికి సత్కారం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జింకా రంగ జనార్దన్‌ను బుధవారం పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కడపజిల్లా శాఖ అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను ఆయనకు బహూకరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు రాటాల గోపి, కోశాధికారి వెంకటక్రిష్ణయ్య, పరిచయ వేదిక సుబ్బరాయుడు, రెయిన్‌బో సుబ్బరాయుడు, గునిశెట్టి సాయికుమార్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ జోన్ ఇన్‌చార్జుల నియామకం

కడప కార్పొరేషన్ : జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు(జేసీఎస్) జోన్ ఇన్‌చార్జులను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు ఒకరు చొప్పున జేసీఎస్ మండల ఇన్‌చార్జులను నియమించామని, ఆ క్రమంలోనే కడప నగరపాలక సంస్థలో ఉన్న నార్త్‌జోన్ ఇన్‌చార్జిగా ఎస్ఎండీ షఫీ, సౌత్ జోన్‌కు ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, ఈస్ట్ జోన్‌కు ఎం. మల్లికార్జున, వెస్ట్ జోన్‌కు పాకా సురేష్ కుమార్‌లను నియమించారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు జోన్ ఇన్‌చార్జులతో పార్టీ కార్యక్రమాలపై సమన్వయం చేసుకొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

సచివాలయ కార్యదర్శిపై దాడి దారుణం

కడప కార్పొరేషన్ : ప్రొద్దుటూరులో వార్డు ఎమినిటీస్ సెక్రటరీగా పనిచేస్తున్న వంశీక్రిష్ణపై దాడి చేయడం దారుణమని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు హీరామియ్యా ఒక ప్రకటనలో తెలిపారు. దాడి జరిగిన వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రొద్దుటూరు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చక్కటి ప్రణాళికతో లక్ష్యసాధన సాధ్యం



కెరీర్ కౌన్సిలింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

వైవీయూ : విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు చక్కటి ప్రణాళికతో సన్నద్ధం కావాలని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్టెప్ సీఈఓ మాట్లాడుతూ యువత చదువుకునే సమయంలోనే ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాకారం కోసం శ్రమించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవడం ద్వారా దేశప్రగతి సాధ్యమవుతుందన్నారు. విశ్రాంత టూరిజం అధికారి గోపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు కెరీర్‌కు తగిన విధంగా ప్రిపేర్ కావాలని సూచించారు. అనంతరం ఏపీ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కెరీర్ కౌన్సిలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాన్ని ఆవిష్కరించి, విద్యార్థినులకు అందజేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మిదేవి, డా. పి. శచీదేవి, నాగవేణి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈకార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైల్వే పార్సల్ కార్యాలయం, బుకింగ్ ఆఫీసు,వెయిటింగ్ హాలు, ప్లాట్‌ఫామ్స్, గూడ్స్ షెడ్, ప్యాసింజర్ రైలులోని బ్యాగులను కూడా తనిఖీ చేశామన్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని చౌడమ్మ అనాథ, వృద్ధుల ఆశ్రమంలో బుధవారం అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం రాయవరానికి చెందిన కుడుం రాజమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులు సత్యనారాయణరెడ్డి గౌడ్, కుడుం లలిత వృద్ధులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఇరిగేషన్‌శాఖ రిటైర్డ్ అకౌంట్స్ ఆఫీసర్ డి.రాజమోహన్ పాల్గొన్నారు.

యువత ఓటు వినియోగంతో సమాజంలో మార్పు

ఓటరు దినోత్సవ చైతన్యర్యాలీలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య



ఓటరు చైతన్య ర్యాలీలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు

వైవీయూ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు బలమైన ఆయుధమని, ఆ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం వైవీయూ ఎన్ఎస్ఎస్ సేవాపథకం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ చైతన్య ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నంతగా ఓటరు చైతన్యం పట్టణాల్లో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యావంతులు ఓటు నమోదులో కచ్చితంగా పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. పార్టీలు ఏదైనా ఓటు వినియోగించుకోవడం అంటే మనం జీవించి ఉన్నట్లుగా ఆయన ఉదహరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ గమనాన్ని రుజుమార్గంలో తీసుకువెళ్లేది ఓటు అని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డా. టి.చంద్రశేఖర్, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డా.సుబ్రమణ్యంశర్మ, డా.శివప్రతాప్, డా. రెడ్డయ్య, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా.ఆదినారాయణరెడ్డి, డా. టి. సురేష్‌బాబు, డాక్టర్ మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీకళాశాలలో ఓటరు చైతన్య దినోత్సవం పురస్కరించుకుని ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఓటు మన ప్రథమ హక్కు

కడప ఎడ్యుకేషన్ : ఓటు మన ప్రథమ హక్కు అని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నూర్జహాన్ సూచించారు. కలెక్టరేట్‌కు సమీపంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు ఏ విధంగా నమోదు చేసుకోవాలనే విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాజారావు ఓటు హక్కు ఆవశ్యకతను గురించి విద్యార్థులకు వివరించారు. ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లను గౌరవించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఓటర్లను గౌరవించుకోవడం సంతోషదాయకంగా ఉందని జన వికాస్‌సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహీర్ తెలిపారు. కడప నగరంలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్ అష్రఫ్ అలీఖాన్‌ను ఘనంగా సత్కరించారు. న్యాయవాది అమీన్ పీరా, కరీముల్లా, రఫీక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

కమలాపురం : ఓటు ఆయుధం కంటే గొప్పదని, ఓటు వజ్రాయుధం అని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలని కమలాపురం మండల తహసీల్దార్ అమరేశ్వరీ తెలిపారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని వేడుకలా నిర్వహించారు. చదిపిరాళ్ల పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించిన వేడుకలో ఆమె పాల్గొని సీనియర్ ఓటర్లను సన్మానించారు. అలాగే ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా జనవరి 25న ఏర్పడటంతో ఆ రోజును జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం లింగారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో సీనియర్ ఓటర్లను మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు బాలగంగిరెడ్డి, సర్పంచ్ తెల్లదార్ల సుబ్బరాయుడు, నాయకులు రమణా యాదవ్, వీఆర్ఏలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నూర్జహాన్



కమలాపురం సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ అమరేశ్వరీ

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ తగదు



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సామూహిక నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన కేంద్రానికి తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు ప్రైవేట్ పరం చేస్తూ 40 వేల మంది కార్మికులను రోడ్డు పడేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు వెంకట శివ, కేసీ బాదుల్లా, పులి కృష్ణమూర్తి, సెబ్బారెడ్డి, వేణుగోపాల్ బషీరున్నీషా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : మండలంలోని ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శేషా చలపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం వార్డు-1 సచివాలయం పరిధిలో బీసీ-జనరల్‌కు, కమలాపురం-3వ వార్డు సచివాలయంలో ఓసీ జనరల్‌కు, సంబటూరు సచివాలయం పరిధిలోని సి.గోపులాపురం పంచాయతీ పరిధిలో బీసీ-జనరల్ అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎస్ఎస్‌సీ పాసై ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఈనెల 30వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన అన్నారు.

క్రీడల ప్రాధాన్యతను గుర్తించాలి

30 ఆంధ్రా బెటాలియన్ సీఓ లెఫ్టినెంట్ కల్నల్ విభోర్ గుప్తా



మాట్లాడుతున్న కల్నల్ విభోర్ గుప్తా

కడప స్పోర్ట్స్ : చదువుతో పాటు క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విభోర్ గుప్తా కోరారు. బుధవారం కడప నగరం చిన్నచౌకులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో క్రీడాదినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయనకు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం లభించింది. అనంతరం ఆయన ఒలంపిక్ టార్చ్‌తో క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ ధ్యేయంగా క్రీడలకు చక్కటి ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమన్వయం, స్నేహభావం, ఓటమిని తట్టుకునే శక్తి లభిస్తాయన్నారు. అనంతరం క్రీడాపోటీలను అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, పీఈటీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వర ప్రజాప్రదర్శనను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ తదితరులు

వైవీయూ : సిద్దేశ్వరంలో ఈనెల 28న నిర్వహించనున్న సిద్దేశ్వరం ప్రజాప్రదర్శనను విజయవంతం చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ కోరారు. బుధవారం వైవీయూలో ప్రజాప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నిర్మాణం కన్నా ముందే సిద్దేశ్వరం వద్ద కృష్ణా పెన్నా ప్రాజెక్టు నిర్మాణానికి 1951లోనే ప్లానింగ్ కమిషన్ అనుమతి ఇచ్చిందన్నారు. ఈ నిర్మాణం జరిగి ఉంటే రాయలసీమకు నికరంగా 400 టీఎంసీల జలాలు అందుబాటులో ఉండి సంవత్సరం పొడవునా మూడు పంటలకు వాడుకోవడానికి ఉండేదన్నారు. రాయలసీమలో లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. సిద్దేశ్వరం వద్ద రోడ్డు కమ్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న వేలాదిమందితో నిర్వహించే రాయలసీమ ప్రజాప్రదర్శన కార్యక్రమానికి ప్రజాసంఘాలు, ప్రజలు, మేధావులు, రైతులు, ఉపాధ్యాయులు అందరకూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ సంతోషంగా ఉండాలి

కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆకాంక్ష



ఎమ్మెల్సీ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : భగవంతుని ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కోరారు. చెన్నూరు మండలం రామనపల్లె గ్రామంలో 26వ తేదీ గురువారం శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వజ సహిత శ్రీనవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 25వ తేదీ బుధవారం యంత్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సంబంధిత పూజ కార్యక్రమానికి హాజరైన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి ఆలయ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. రామనపల్లె ప్రజలు తలపెట్టిన ఒక గొప్ప కార్యక్రమం ఇది అని చుట్టపక్కల అన్ని ప్రాంతాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆలయ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచార పోస్టర్లను కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని, వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. జిల్లా కో ఆర్డినేటర్లు ప్రతాప్‌రెడ్డి, ఎస్. వెంకట్రామిరెడ్డి, కిరణ్ కుమార్, ఉద్యోగ సంఘాల నాయకులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎర్రగుడిపాలెం సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, రాయల్ బాషా పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ డేను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఈనెల 27వ తేది నిర్వహించనున్న ఎలక్ట్రికల్ డేను విజయవంతం చేయాలని కడప జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం గోకుల్ లాడ్జి సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1880 సంవత్సరం జనవరి 27వ తేది థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనుగొన్న సందర్భంగా ఈ ఎలక్ట్రీషియన్ డేను నిర్వహించుకుంటున్నామన్నారు. 2019 సంవత్సరం ఏపీలోని 13 జిల్లాల నుంచి దాదాపు పదివేల మందితో విజయవాడలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించామని, తర్వాత 2020లో కడపలో ఐదువేల మందితో నిర్వహించామన్నారు. కరోనా వల్ల రెండేళ్లు జరుపలేకపోయామన్నారు. ఈ ఏడాది ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబులు హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని ఎలక్ట్రిల్ వర్కర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ షాపుల యజమానులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగర అధ్యక్షుడు చిట్టి, నగర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఉఉపాధ్యక్షులు ప్రసాద్, షరీఫ్ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వ కృషి భేష్



జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ఫోటోలను ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గండికోటను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ చీఫ్ ప్యాట్రన్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి అన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవ సందర్భంగా బుధవారం హోటల్ మానస ఇన్‌లో బుధవారం జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల నూతన ఫొటోలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ ప్రతిష్ఠను పెంచేందుకు ఒబెరాయ్ హోటల్స్ లాంటి సంస్థ గండికోటలో నిర్మాణాలు చేపట్టేలా కార్యాచరణను రూపొందించడం పర్యాటక ప్రేమికులను ఉత్సాహ పరుస్తుందన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ , సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, పోతుల వెంకట్రామిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని గోపాలపురం గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సహిత ధ్వజ, విగ్రహ, శిఖర ప్రతిష్ట సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం విగ్రహ ప్రతిష్ట అనంతరం ఉదయం 8 గంటల నుంచి బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతిగా రూ.40,116, రెండవ బహుమతి రూ.30,116, మూడవ బహుమతి రూ. 20,116, నాల్గవ బహుమతి రూ.15,116, ఐదవ బహుమతి 10,116, ఆరవ బహుమతి రూ.5,116 అందజేస్తామన్నారు.

28లోపు 'లిప్' పరీక్షను తప్పనిసరిగా నిర్వహించాలి

డిప్యూటీ ఈవో రాజగోపాల్‌రెడ్డి



సమీక్షిస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (లిప్) పరీక్షను ఈ నెల 28వ తేదీలోపు తప్పనిసరిగా నిర్వహించాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప చెమ్ముమియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లిప్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లిప్ మానిటరింగ్ టీం సభ్యులు గంగాధర్, సురేష్, స్వర్ణలతతో కలిసి విద్యార్థుల పరీక్ష పేపర్లను, గ్రేడింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంకు సంబంధించి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. చింతకొమ్మదిన్నె ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, హెచ్‌ఎం మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌ను బుధవారం కడప డీఎస్పీ బీవీ శివారెడ్డి అకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ అశోక్‌రెడ్డి, ఎస్.అరుణ్‌రెడ్డిలకు సూచించారు.

నగరానికి గణతంత్ర కళ

- నేడు రిపబ్లిక్ డే
- పోలీసు పెరేడ్ మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్- రిమ్స్ మార్గం



విద్యుద్దీప వెలుగుల్లో ఆర్టీసీ బస్టాండు సర్కిల్



పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేస్తున్న సిబ్బంది

కడప కల్చరల్/అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని జిల్లావాసులు రెట్టించిన ఉత్సాహంతో నిండైన దేశభక్తితో నిర్వహించుకోనున్నారు. అధికారులు రోడ్ల కూడళ్లను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి ఉత్సవ శోభ కల్పించారు. జిల్లా కేంద్రమైన కడప నగరం పోలీసు పెరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించి ఘనంగా సత్కరిస్తారు. జిల్లా సాధించిన అభివృద్ధిని శకటాల రూపంలో మైదానంలో ప్రదర్శిస్తారు. పేదలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రుణాలు, వృత్తి పరికరాలను అందజేస్తారు. ప్రతిభ చూపిన పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

ఏర్పాట్లు

నేటి కార్యక్రమం కోసం పోలీసు పెరేడ్ మైదానంలో ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేసి కనుల పండువగా అలంకరించారు. వేదికకు ఒకవైపు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, జిల్లా ప్రముఖులు ఆసీనులయ్యేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు దేశభక్తి పూరితమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.